క్లుప్తంగా

ఇద్దరు వ్యక్తులపై బైండోవర్ కేసు నమోదు

పెనమలూరు: ఇద్దరు వ్యక్తులపై పోలీసులు శుక్రవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కోడి పందేలు నిర్వహిస్తున్నారని ముందస్తు చర్యల్లో భాగంగా పోరంకికి చెందిన లావూరి శ్రీను, యనమలకుదురుకు చెందిన ఉప్పు తిరుమలయ్యలపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో మహిళలకు శిక్షణ

కంకిపాడు: భగవాన్ సత్యసాయిబాబా శత జయంతి సందర్భంగా మహిళా యువతకు స్వయం ఉపాధిపై శిక్షణ ఇస్తామని శ్రీ సత్యసాయిసేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ మహిళా యువతకు ఉపాధి కల్పించటానికి హైదరాబాద్‌కు చెందిన ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ సహకారంతో కంకిపాడు గాయత్రీ విహార్‌లో ఫిబ్రవరి మొదటి వారం నుంచి 40 రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. 19 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళలకు మగ్గం, చీరల డిజైన్‌పై ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత శిక్షణ ఉంటుందని, భోజన వసతి కల్పిస్తామని, ఆసక్తి కలిగిన వారు శిక్షణ పొందవచ్చని తెలిపారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: భర్త అదృశ్యమయ్యాడని భార్య ఫిర్యాదు చేయటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఇందిరానగర్‌కు చెందిన షేక్ ఫాతిమా కొద్ది సంవత్సరాల క్రితం నాజఫ్ ఆలీని వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త వ్యాపారం చేస్తాడు. అతను బుధవారం వ్యాపారం నిమిత్తం జగ్గయ్యపేటకు వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం కోశాధికారిగా శ్రీదేవి



రామవరప్పాడు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచ్‌ల సంక్షేమ సంఘం కోశాధికారిగా రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు శ్రీదేవికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వరి శ్రీదేవి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కార్యవర్గంలో స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

11న వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

గన్నవరం: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యకర్తల సమీక్ష సమావేశం స్థానిక విమానాశ్రయం పక్కనే ఉన్న ఏబీ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 11వ తేదీ ఉదయం 9 గంటలకు జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని కోరారు.

వణుకూరులో వాలీబాల్ పోటీలు ప్రారంభం



పెనమలూరు: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు అన్నారు. వణుకూరు గ్రామంలో శుక్రవారం సీజీ యూత్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. సీఐ గోవిందరాజు మాట్లాడుతూ యువత క్రీడల్లో పాల్గొనటం వలన క్రమశిక్షణతో ఉంటారన్నారు. క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. యువత క్రీడలపై ఆసక్తి చూపి రాణించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచి గద్దల రాజా, వైఎస్సార్ సీపీ నేత చెక్కా గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిడమానూరులో గడప గడపకు మన ప్రభుత్వం

విజయవాడరూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిడమానూరు గ్రామం మూడో సచివాలయం పరిధిలో శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

కాలువ కట్ట రోడ్లకు మహర్దశ

- రూ 2.60 లక్షలతో 4,620 మీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణం
- కాలువ కట్ట వాసులకు ఇచ్చిన హామీ అమలు



పెనమలూరు పల్లిపేటలో నిర్మించిన సీసీ రోడ్డు



తాడిగడప రామానగర్‌లో నిర్మించిన సీసీ రోడ్డు

పెనమలూరు: బందరు కాలువ కట్టలపై నివసిస్తున్న పేద ప్రజలకు ప్రభుత్వం పూర్తి మౌలిక వసతులు కల్పించింది. కాలువ కట్ట ప్రాంత నివాసితుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కోట్ల రూపాయలు వెచ్చించి కాలువ కట్టలపై సిమెంట్ రోడ్లు నిర్మాణం చేసింది. పెనమలూరు మండలం డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో యనమలకుదురు నుంచి గంగూరు వరకు బందరు కాలువ కట్టలపై పేద ప్రజలు చాలా సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు. అయితే కాలువ కట్ట వాసులకు కనీస వసతులు కల్పించటంతో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. కాలువ కట్టలపై రోడ్లు, వీధి దీపాలు లేక పేదలు చాలీచాలని వసతులతో జీవించారు. పేదలు ఎంత మొరపెట్టుకున్నా గత పాలకులు పట్టించుకోలేదు. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత బందరు కాలువ కట్టలపై నివసించే పేదలకు కూడా మేలు జరిగింది. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో కాలువ కట్టలపై సిమెంట్ రోడ్లు నిర్మాణం చేయాలని నిర్ణయించారు. పెనమలూరు పల్లిపేటలో రూ.60 లక్షలతో 640 మీటర్ల సీసీ రోడ్డు, తాడిగడప రామానగర్‌లో రూ.70 లక్షలతో 850 మీటర్ల సీసీ రోడ్డు, తాడిగడప కార్మికనగర్‌లో రూ.70 లక్షలతో 1280 మీటర్ల సీసీ రోడ్డు, యనమలకుదురు ఇందిరానగర్ వన్‌లో రూ.30 లక్షలతో 1050 మీటర్ల సీసీ రోడ్డు, యనమలకుదురు అంబేడ్కర్‌నగర్‌లో కరకట్ట లింకు రోడ్డు రూ.30 లక్షలతో 800 మీటర్ల మేర నిర్మాణం చేశారు.

కాలువ కట్ట వాసులకు భరోసా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కాలువ కట్ట వాసులకు భరోసా ఏర్పడింది. గత టీడీపీ పాలనలో కాలువ కట్టలపై ఉన్న ఇళ్ల తొలగించి సుందరీకరణ చేయాలని ప్రతిపాదనలు చేశారు. దీంతో కాలువ కట్ట వాసులు ఇళ్లు తొలగిస్తారని చాలా రాత్రుళ్లు నిద్రలేకుండా గడిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమ కష్టాల తొలగాయని స్థానికులు తెలిపారు.

కాలువ కట్ట ప్రాంతం అభివృద్ధి

కాలువ కట్ట ప్రాంతంలో మరింత అభివృద్ధి చేస్తాం. నివాసితులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే కాలువ కట్ట వాసులకు ఇళ్ల పన్నులు గణనీయంగా తగ్గించాం.

–ఎస్.ప్రకాశరావు, కమిషనర్, తాడిగడప మున్సిపాలిటీ

ప్రణాళికాబద్ధంగా చదవాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న జెడ్పీటీసీ సువర్ణరాజు, సర్పంచ్ వరి శ్రీదేవి

రామవరప్పాడు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని జెడ్పీటీసీ సభ్యుడు కాకర్లమూడి సువర్ణరాజు అన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులు 175 మందికి స్ఫూర్తి స్టడీ మెటీరియల్స్‌ను అందజేశారు. సువర్ణరాజు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్స్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కోశాధికారిగా ఎన్నికైన సర్పంచ్ వరి శ్రీదేవిని సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం తాయారు, వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో నూతన పింఛన్ల పంపిణీ

కంకిపాడు: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్‌లను ఈడుపుగల్లులో శుక్రవారం పంపిణీ చేశారు. గ్రామ సర్పంచి పి.ఇందిర, ఎంపీటీసీ సభ్యుడు బూరుగ బాలాజీ లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం పింఛన్‌లు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు

గన్నవరం రూరల్: చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో శుక్రవారం పాలియేటివ్ కేర్ అంశంపై పాలియం ఇండియా, త్రివేండ్రం ఆధ్వర్యంలో వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సంస్థ ప్రతినిధులు డాక్టర్ రాధా వెంకటేశన్, ఏజే శాలిని ప్రసంగించారు. పాలియేటివ్ కేర్ విధానం జీవిత నాణ్యతను మెరుగుపరుస్తోందని చెప్పారు. సంక్లిష్ట అనారోగ్యంతో బాధపడుతున్న వారి బాధను తగ్గిస్తోందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మూర్తి, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కల్యాణి, డాక్టర్ ఈశ్వర్, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

నున్న(విజయవాడరూరల్): జగనన్న స్ఫూర్తి స్టడీ మెటీరియల్‌ను సక్రమంగా వినియోగించుకుని పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులు 155 మందికి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు కె.కోటేశ్వరరావు, ఎస్.రవిప్రసాద్, మనోహర్ కుమార్, ఈశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విజయవాడరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు వెలగలేరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాన్ని గ్రామాల్లో నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది ప్రజలకు వివరించారు. మురుగుకాల్వలు శుభ్రంగా ఉంచాలని, ఇళ్ల వద్ద ఖాళీ కొబ్బరి బొండాలు లేకుండా చూసుకోవాలని, పాత టైర్లు లేకుండా చూడాలని, నిల్వ ఉన్న నీటిని 24 గంటలు తర్వాత తొలగించాలని వైద్య సిబ్బంది సూచించారు. నున్న గ్రామంలో మూడు సచివాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

100 మందికి ఉచిత హోమియో వైద్య సేవలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి, హిందూ ధర్మ పీఠం అన్నదాన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హనుమాన్‌జంక్షన్‌లో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సమితి అధ్యక్షుడు కోటా సురేష్ ప్రారంభించారు. అన్నపూర్ణ మల్టీ స్పెషాలిటీ హోమియో క్లినిక్ (గుడివాడ)కు చెందిన డాక్టర్ శ్రీకృష్ణ యాదవ్, డాక్టర్ శ్రీవిద్య రోగులకు వైద్య సేవలు అందించారు. 100 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సమాచార హక్కు చట్టం ప్రచార సమితి అమరావతి గౌరవ అధ్యక్షుడు అట్లూరి రాజశేఖర్, మండల అధ్యక్షుడు కాలి కిరణ్, హిందూ ధర్మ పీఠం ప్రతినిధి పొట్లూరి సత్య ఫణీంద్ర పాల్గొన్నారు.

శిల్ప కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రోత్సాహం



వృద్ధ కళాకారులను సత్కరిస్తున్న చైర్‌పర్సన్

కేసరపల్లి(గన్నవరం): కేసరపల్లి శివారు వెంకట నరసింహాపురం కాలనీలోని సత్య వెంకట వినాయక శిల్పశాలను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ (లేపాక్షి) చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి సందర్శించారు. శిల్పశాలలో తయారు చేసిన వస్తువులను పరిశీలించిన ఆమె కళాకారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

కళాకారులు మాట్లాడుతూ తాము తయారు చేసిన వస్తువులను లేపాక్షి ఎంపోరియం ద్వారా కొనుగోలు చేయాలని, బొమ్మలకు పెయింటింగ్ వేసే మిషన్లను రాయితీపై సరఫరా చేయాలని, ఎగ్జిబిషన్లలో కళాకారులు తయారు చేసిన వస్తువులను ప్రదర్శనలకు, విక్రయాలకు అవకాశం కల్పించాలని, బ్యాంకుల ద్వారా రాయితీపై రుణాలు, ఆధునిక బొమ్మల డిజైన్స్‌పై శిక్షణ ఇవ్వాలని కోరారు. అనంతరం వృద్ధ కళాకారులు ఆరిపాక అప్పలాచారి, లక్ష్మిని వైస్ చైర్మన్ దుశ్శాలువాలతో సత్కారించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బడిగించల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

వెండి శఠగోపం సమర్పణ



పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని షిర్డీ సాయిబాబా ఆలయానికి దాతలు వెండి శఠగోపాన్ని శుక్రవారం బహూకరించారు. విజయవాడకు చెందిన బూరెల లోకనాథం, శ్రీలక్ష్మీ దంపతుల కుమార్తెలు లాస్య, వంశీకళ సౌజన్యంతో సుమారు రూ.40 వేల విలువ గల వెండి శఠగోపం, వెండి ప్లేటును బహూకరించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, వరదా అప్పారావు, సభ్యులు ఊటుకూరి ఉమా మహేశ్వరరావు, మేకా పేరయ్య, కూనపరెడ్డి చెన్నారాయుడు, కె. దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

ఎంపీడీఓ వెంకటరమణ



దొండపాడు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ


గుడివాడరూరల్: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ అనగాని వెంకట రమణ అన్నారు. దొండపాడు జగనన్న కాలనీలో శుక్రవారం ఆమె ఇళ్ల నిర్మాణాలను, వాటి పురోగతిని గృహ నిర్మాణ శాఖాధికారులతో కలిసి పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులతో పాటు లబ్ధిదారులతో నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను సంబంధిత శాఖాధికారులు విజయవంతం చేసి ప్రభుత్వానికి, అధికారులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులతో చర్చించి వీలైనంత త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గద్దే రాము, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేణుకా పరమేశ్వరునికి అన్నాభిషేకం



పామర్రు: స్థానిక అంకమ్మతల్లి ఆలయంలోని రేణుకా పరమేశ్వరునికి పుష్య మాసం పౌర్ణమి శుక్రవారాన్ని పురస్కరించుకుని స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. తొలుత ఆలయంలోని స్వామిని ఆవుపాలతో అభిషేకించారు. అనంతరం దేవి శాంతి హోమం నిర్వహించారు. భక్తులు జోగి సురేష్‌కుమార్, నాగమల్లేశ్వరీ దేవి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి అన్నాభిషేకం వైభవంగా నిర్వహించారు. అన్నాభిషేకం జరిగిన అన్నంతో భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోటి పాండురంగారావు, వరదా అప్పారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి



పామర్రు: పామర్రు సబ్ ట్రెజరీ కార్యాలయం పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను బయోమెట్రిక్ ద్వారా అందజేయాలని సబ్ ట్రెజరీ ఆఫీసర్ పి. శోభన్‌బాబు అన్నారు. స్థానిక ఎస్‌టీఓ కార్యాలయంలో బయోమెట్రిక్ విధానాన్ని శుక్రవారం ప్రారంభించి ఆయన మాట్లాడారు. పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను బయోమెట్రిక్ ద్వారా అందజేసే విధానం ఆన్‌లైన్‌లో ప్రారంభమైందన్నారు. బయోమెట్రిక్ విధానం చేయించుకోదలచిన వారు తమ ఆధార్ నెంబర్‌తో లింక్ అయిన సెల్‌ఫోన్, విశ్రాంత ఉద్యోగి ఐడీ నెంబర్, ఆధార్‌కార్డు, పీపీఓ నెంబర్‌ను తమ వెంట తీసుకురావాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరు లోగా పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను కార్యాలయంలో అందజేయాలని చెప్పారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి బయోమెట్రిక్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్‌ను అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ పి. ప్రేమ్‌రాజు, జూనియర్ అసిస్టెంట్ బి. మనోహర్‌బాబు, సంఘ అధ్యక్షుడు ఎస్. సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీపీ అనగాని రవి
- 350 మందికి కొత్త పింఛన్ల పంపిణీ



కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు

గన్నవరం: పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ అనగాని రవి అన్నారు. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం పింఛన్ల వారోత్సవంలో భాగంగా మండలంలో కొత్తగా మంజూరైన 350 మందికి కొత్త పింఛన్లను అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం జన్మభూమి కమిటీలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాత్రం కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికి పింఛన్లు మంజూరు చేస్తున్నారని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీకి అనుగుణంగా పింఛన్లను దశల వారీగా రూ. 2,750కు పెంచారని తెలిపారు. జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, ఎంపీడీఓ కె. వెంకటేశ్వరరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రక్తదాన ఆవశ్యకతను ప్రతిఒక్కరూ గుర్తించాలి



మాట్లాడుతున్న కుమార్

గన్నవరం: రక్తదాన ఆవశ్యకతను ప్రతిఒక్కరు గుర్తించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సమన్వయకర్త బీవీఎస్ కుమార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ గన్నవరం శాఖ ఆధ్వర్యంలో రక్త గ్రూపుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. కుమార్ మాట్లాడుతూ...రక్తదానం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. మనం చేసే రక్తదానం మరో ముగ్గురు ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ అట్లూరి పద్మావతి మాట్లాడుతూ రక్తదానం చేయడం మహోన్నతమైన మానవసేవగా విద్యార్థులు భావించాలని తెలిపారు. రెడ్ క్రాస్ గన్నవరం శాఖ ప్రతినిధులు చిన్ని మాధవి, డాక్టర్ ఎం. విజయకుమార్, ఎం. ప్రభాకర చౌదరి, గన్నె వెంకట్రావు, వి. కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివ ముక్కోటి వేడుకలు



రుద్రాక్షలతో స్వామివారికి అభిషేకం

దావాజిగూడెం: దావాజిగూడెంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో శుక్రవారం శివ ముక్కోటి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చావలి మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష రుద్రాక్షలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం రుద్ర హోమాలు, స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారి అభిషేకానికి వినియోగించిన రుద్రాక్షలను భక్తులకు పంపిణీ చేశారు. శివుడికి ఎంతో ప్రీతికరమైన ఆరుద్ర నక్షత్రం రోజున శివకేశవులను దర్శించుకుంటే ఆధ్యాత్మిక సంతృప్తి లభిస్తుందన్నారు. ఆలయ ధర్మకర్త గొంది పూర్ణచంద్రరావు, కమిటీ సభ్యులు, పరిసర ప్రాంత భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్‌యాప్‌ల వారి వేధింపులతో ఆత్మహత్యాయత్నం



రోహిత్ కుమార్ (ఫైల్)

హనుమాన్‌జంక్షన్ రూరల్: క్రికెట్ బెట్టింగ్‌కు బానిసైన యువకుడు అప్పులపాలై తీవ్ర మానసిక ఒత్తిడితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. స్థానిక వేలేరు క్రాస్‌రోడ్డుకు చెందిన యువకుడు మేడేపూడి రోహిత్ కుమార్ (23) ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడ్డాడు. ఈ బెట్టింగ్‌కు డబ్బుల కోసం ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నాడు. దీంతో క్రమేణా అప్పులు పెరిగిపోవడం, చెల్లింపులకు తీవ్ర ఒత్తిడి పెరగడంతో రోహిత్ కుమార్ మానసిక ఒత్తిడికి లోనయ్యాడు. అప్పు తీసుకున్న మొత్తం కంటే అధికంగా వసూలు చేస్తూ వేధించడంతో తీవ్ర మనస్తాపం చెందిన రోహిత్ కుమార్ ఈనెల 4వ తేదీ సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి గుర్తించిన తల్లిదండ్రులు చిన్నవుటపల్లిలోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన హనుమాన్‌జంక్షన్ పోలీసులు రోహిత్ కుమార్ నుంచి వాగ్మూలం తీసుకున్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్, లోన్ యాప్‌ల వేధింపులపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహించే బుకీలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

బుకీల ఆగడాలే ఆత్మహత్యకు కారణం..

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ బుకీల వేధింపులతో చేతికి అందివచ్చిన ఒక్కగాని ఒక్క కొడుకును కోల్పోయానని మృతుడి తండ్రి మేడేపూడి కోదండరామయ్య వాపోయాడు. నా లాంటి దుస్థితి ఏ కన్నతండ్రికీ రాకూడదన్నాడు. సునీల్ అనే క్రికెట్ బుకీ వల్లే బెట్టింగ్‌కు బానిసయ్యాడని ఆరోపించాడు. చాలా మంది యువకుల జీవితాలు ఇలాంటి బుకీల వల్ల నాశనమవుతున్నాయని చెప్పారు. ఆన్‌లైన్ లోన్ యాప్‌లో తీసుకున్న రుణాలు పూర్తిగా చెల్లించినప్పటికీ ఇంకా చెల్లించాలనే వేధింపులు రోహిత్‌కుమార్‌కు అధికమయ్యాయన్నారు. ఇటీవలే రూ.2 లక్షల అప్పును చెల్లించామని, కానీ ఇంకా రూ.1.75 లక్షలు ఇవ్వాలని వేధిస్తున్నారని చనిపోయే ముందు రోహిత్ చెప్పాడు. పోలీసులు ఇలాంటి బెట్టింగ్ బుకీలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ఆగడాలను కరికట్టాలని కోరాడు.

బెట్టింగ్ నిర్వాహకులపై ఆరా తీస్తున్నాం: సీఐ

హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు ఇప్పటి వరకూ ఎలాంటి ఆనవాళ్లు లేవు. తాజాగా రోహిత్ ఆత్మహత్య నేపథ్యంలో వీటిపై పూర్తిగా నిఘా పెట్టామని సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి తెలిపారు. బెట్టింగ్ నిర్వహించే బుకీలు, ఆన్‌లైన్ లోన్ యాప్‌ల ద్వారా రుణాల చెల్లింపులకు వేధింపులకు గురిచేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోహిత్ ఆత్మహత్యకు కారణమైన బుకీలు వివరాలు సేకరిస్తున్నామన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో విజిలెన్స్ తనిఖీలు



ముదినేపల్లి పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ సీఐ విల్సన్, ఎస్ఐ రంజిత్‌కుమార్

కైకలూరు/ముదినేపల్లి రూరల్: ప్రభుత్వాస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, పారిశుధ్యం, భోజన వసతి, మందులు, రికార్డులు వంటి పలు అంశాలను ఏలూరు జిల్లా విజిలెన్స్ డీఎస్పీ శింగలూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రెండు బృందాలుగా కైకలూరు సీహెచ్‌సీ, ముదినేపల్లి పీహెచ్‌సీలను శుక్రవారం తనిఖీ చేశారు. కైలూరు సీహెచ్‌సీలో రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను డీఎస్పీ వెంకటేశ్వరరావు నమోదు చేసుకున్నారు. ఇన్ పేషెంట్, ఔట్ పేషెంట్ గదులు, థియేటర్‌ను పరిశీలించారు. ముదినేపల్లి పీహెచ్‌సీలో విజిలెన్స్ సీఐ విల్సన్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్ఐ సీహెచ్ రంజిత్‌కుమార్, విజిలెన్స్ ఏఈ తోట శ్రీనివాసరావు, కైకలూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వి.రాంబాబు, డాక్టర్లు దుర్గా ప్రసాద్, నీలిమ, కీర్తి, హెడ్ నర్సు సీహెచ్ వర్ధినియా, జూనియర్ అసిస్టెంట్ దీపక్ పాల్గొన్నారు.